


# పరదేశీ కథలు

## - చిట్టే సిద్ధ లలిత



- 98-

## కరోనా కలిపిన బంధం

**హైద్రాబాద్ రాజీవ్** గాంధీ ఎయిర్ పోర్ట్ లో 2020 జూలై 10 వ తేదీన అబద్ధం ఆడాను నేను. దాంతో పధ్నాలుగు రోజుల ఎయిర్పోర్ట్ క్వారంటైన్ తప్పించుకున్నాను.

ఆడక తప్పలేదు. ఆ సందర్భం అలాంటిది.

2020...

కష్టపడి కట్టుకున్న కలల మేడలను నిర్దాక్షిణ్యంగా కూల్చిన సంవత్సరం. కువైట్ ధనిక దేశం. దేనికీ కొదువ లేదు. ఎప్పుడూ సంబరాలతో సంతోషంగా, సందడి చేస్తూ వుంటుంది. వినూత్నమైన అలంకరణలతో సర్వాంగ సుందరంగా కనబడే కువైట్ పట్టణం ఇప్పుడు భయాందోళనలతో వణికి పోతోంది. మాయదారి జబ్బు వచ్చి పడేసరికి నీరసించి పోయింది.

ఆ సందడి ఏమయిందో. ఆ సంబరాలు ఏమయ్యాయో..

కువైటే కాదు ప్రపంచమే గతి తప్పింది. తాళం తప్పిన పాటలా అపశృతులు పలికిస్తోంది. రోజురోజుకూ పరిస్థితి విషమంగా మారుతోందే కానీ కుదుట పడటంలేదు.

బంధించబడ్డ గది కిటికీలోనుండి బయటికి చూస్తే చలనాన్ని మరిచిన పరిసరాలన్నీ నిస్తేజంగా కనబడుతున్నాయి.

విపత్తును తలచి గాలి తల్లడిల్లుతోంది. భూమి నిశ్శబ్దంగా రోదిస్తుంటే చెట్లు సంతాపాన్ని సూచిస్తూ మౌనంగా నిలబడి వున్నాయి. రాత్రింబగళ్ళు రయ్యిమని దూసుకుపోయే కార్లతో బిజీగా వుండే రోడ్లన్నీ బోసి పోయాయి. జీవచ్ఛవాల్లా దీనంగా చూస్తున్నాయి.

మరలా చైతన్యం ఎప్పుడో? భూమికి పూర్వ వైభవం వస్తుందా. కళ్ళతో చూడగలమా? ప్రాణంతో నిలవగలమా? చూస్తున్న నాకు దు:ఖం ముంచుకొచ్చింది. ఎవరో కక్ష కట్టి మంత్రించినట్లు, చేత్తో తుడిచేసినట్లు కళా కాంతులన్నీ మాసిపోయాయి.

నడి సంద్రంలో తుఫాను గాలికి చిక్కిన నావలా అల్లాడిపోతోంది భూమి.

మరలా మంచి రోజులు ఎప్పుడో?నిశ్చింతగా, చిరునవ్వుతో గుండె నిండా ఊపిరి పీల్చుకునే రోజులు వస్తాయా.. అది జరిగే పనేనా?

ఇంతలో సైరన్ మోగించుకుంటూ ఒక అంబులెన్స్ వచ్చి ఎదురుగా వున్న బిల్డింగ్ వద్ద ఆగింది. యముని వాహనంలా వుందది. ఆ సైరన్ మృత్యుఘంటికల నినాదంలా కర్ణ కఠోరంగా వినబడుతోంది. గుండె దడదడలాడింది.

ముసుగులు వేసుకున్న నలుగురు మనుషులు కిందకి దిగారు. ఏదో ఉత్పాతం జరుగుతుంది అనే సూచన.

చకచకా లోనికి వెళ్ళారు. ఐదు నిమిషాల్లో ఇద్దరు మనుషులను  కిందకు తీసుకొచ్చారు. ఆ ఇద్దరి చుట్టూ వీరు నలుగురూ వలయంలా నిలబడ్డారు. పారిపోతే కాల్చి చంపేస్తాం అనే సూచన వుంది వారి మాటల్లో.

వారిని దోషుల్లా, అంటరాని వారిలా ఏహ్య భావంతో, భయంగా చూస్తూ అంబులెన్స్ వెనక భాగంలో కూర్చోమన్నారు.

బలివ్వబోయే మేకల్లా వున్నారు వారు. బిల్డింగ్ లలో వున్న వారందరూ కిటికీల్లోనుండి ఈ వింతను, విచిత్రాన్ని చూస్తున్నారు.

రేపు తమ పరిస్థితి తెలియదు కదా.. ఆ బిల్డింగ్ లోని కొందరు భయపడి నోటిలోనుండి శబ్దం రాకుండా భోరున ఏడుస్తున్నారు. మరికొందరు దూరంగా నిలబడి బెదురు చూపులు చూస్తూ కళ్ళతో మాట్లాడుకుంటున్నారు.

ఇప్పుడు ఏమి జరగబోతోంది? ఏమవుతుంది?

వారిని ఏం చేస్తారు.  అందరికీ సందేహమే. అంతుపట్టని సందిగ్ధమే. తీసుకెళ్ళి ఎడారిలో పడేస్తారట.

"చస్తే ఇక అంతే. అక్కడే పూడ్చి పెట్టడమే" చెపుతున్నాడు ఒకడు. వింటున్నవాడు భయంతో బిగుసుకుపోయాడు.

అలా కాకూడదు. ఈ ఎడారిలో దిక్కుతెలియని మనిషిలా చావకూడదు. అడ్రస్ లేకుండా ఈ మట్టిలో కలిసి పోకూడదు.

కన్నీళ్ళు పొంగుకొచ్చాయి. గదిలో బంధించ బడ్డ జంతువుల్లా వున్నాము.

పక్షులకు, జంతువులకు స్వేచ్ఛ వుంది కానీ మనిషి తన స్వేచ్ఛను చేజేతులా పోగొట్టుకున్నాడు. పక్కనే వున్న అపార్ట్ మెంట్ లో వున్న మా కొలీగ్స్ ని కూడా కలవడానికి వీల్లేకుండా వుంది. బయట కర్ఫ్యూ విధించారు. కనబడితే పోలీసులు అరెస్ట్ చేస్తున్నారు.

భూమికి ఏదో గ్రహణం పట్టినట్లుంది. ఈ దెబ్బతో మనుషుల్ని తుడిచి పెట్టదు కదా..

లేదు ఎలాగో బయట పడాలి. విపత్తునుండి కాకపోయినా మొదట ఈ ఎడారి దేశం నుండి బయటపడాలి.

మన నేలపైనే చావాలి. చస్తే కనీసం సమాధి ఆనవాలైనా వుండాలి. అధ్వాన్నంగా అడ్రస్ లేకుండా అనాధలా ఈ ఎడారి ఇసుకలో కలిసిపోకూడదు.

ప్రపంచం నలుమూలలా ఫ్లైట్స్, రాకపోకలు అన్నీ ఆగిపోయాయి. ఎలా భారత దేశానికి చేరడం. గాలిలో ఎగిరే పక్షిని చూసి అసూయ చెందాను. రెక్కలుంటే ఎగిరి వెళ్ళిపోదును కదా..

ఫోన్ మ్రోగింది. మా ఫ్రెండ్ పద్మ ఫోన్ చేసింది. కువైట్ లో పరిస్థితిని వివరిస్తోంది.

కరోనాతో ఎంతమంది పోయారో, గుండెపోటుతో ఎంత మంది పోయారో, కనీసం శవాన్ని ఇంటికి చేర్చలేక ఇక్కడే ఎడారిలో గుంతలు తీసి జంతువుల్లా ఎలా ఈడ్చేసారో, ఇంటివద్ద భార్యా పిల్లలు కడసారి చూసే ప్రాప్తంలేక ఎలా ఏడుస్తున్నారో చెప్పుకొచ్చింది. నాకు గుండె దడ హెచ్చింది.

ఇక వినలేక పోయాను. తొందరగా ప్రాణం వుండగానే ఇండియా వెళ్ళాలి.

తెలిసిన ట్రావెల్ ఏజెంట్స్ అందరికీ కాల్ చేసాను. భారత దేశ ప్రధాని ఆదేశాల మేరకు వందే భారత్ విమానాలు వస్తాయని, అవి మొదలయితే తప్పకుండా టికెట్ బుక్ చేస్తామనీ వారు అన్నారు. ఇటు ఇండియాలో ప్రజలు.. పరదేశం నుండి విమానాలు దిగే వాళ్ళతో పాటూ వైరస్ వస్తోందని భయపడి "మీరు రావద్దు, అక్కడే చావండి" అంటున్నారు.

నా ఫ్రెండ్ ఒకామె నాతో అలాగే అంది. నా మనసు చివుక్కుమంది.

అవతల వున్న అబ్బాయిల అకామిడేషన్ లో ఇద్దరికి కరోనా సోకింది. ఆ దెబ్బతో మాకు కట్టుబాట్లు ఇంకా పెరిగాయి. దిగ్బంధనంలో నిలబడిపోయాము. విధి వైపరీత్యం. అప్పట్లో కొలీగ్స్, ఫ్రెండ్స్ కనబడితే ఆప్యాయంగా చేయి కలిపి హత్తుకునేవాళ్ళం ఇపుడు మనిషి కనబడితే దూరంగా జరిగి శత్రువులా చూస్తున్నాము.

మూడు పూటలా మొదటి అంతస్తులోని కెఫ్టేరియాకు వెళ్ళి భోజనం తెచ్చుకుని తింటున్నాం. అక్కడ కూడా గుంపును అనుమతించడం లేదు. ఎవరితోనూ మాటలూ లేవు. ఎవరైనా దగ్గినా, తుమ్మినా భయం.. భయం. భయాందోళనలతో జీవితం.

అలా రెండు నెలలు జరిగాయి.

విమానాలు తిరగడం మొదలయ్యింది.

కానీ హైద్రాబాద్ కు విమానం లేదని, విజయవాడకు అయితే వుందని చెప్పింది మా ఏజెంట్.

ఏదో ఒకటి. సరే కానిమ్మన్నాను.

ఎలాగైనా సరే వచ్చి ఇండియాలో పడితే చాలు అనుకున్నాను నేను.

ఆ సమయం అలాంటిది. భయంకరమైనది జూలై 8 వ తేదీన విజయవాడకు టికెట్ ఓ కె అయింది. సంతోషించాను. కానీ విజయవాడలో ఎన్ని రోజులు క్వారంటైన్ లో వుంచుతారో తెలియదు. అవన్నీ దాటుకుని ఆ తరువాత నేను హైద్రాబాద్ కు రావాలి. ఆంధ్ర రాష్ట్రం దాటి తెలంగాణాకు రావాలంటే ఆంక్షలట. పర్మిషన్ కావాలట.

ఈ కరోనా వచ్చి దేశాలను, రాష్ట్రాలను, జిల్లాలను, ఊర్లను, మనుషులను విడగొట్టేసింది. సరిహద్దులను ఏర్పరిచింది.

ఆ పరిస్థితుల్లో ఫ్లయిట్ దిగాక ఒకవేళ ఏదైనా అనుకూలించకపోతే విజయవాడలో తల దాచుకోవాల్సి వస్తుంది. మనకు అక్కడ ఎవరైనా సహాయం చేసేవాళ్ళు కావాలి.

ఎప్పుడూ ఎవరినీ ఏదీ అడగను నేను.

ఇప్పుడు అడగక తప్పడం లేదు.

తెలిసిన వాళ్ళకి కాల్ చేసి వివరాలు అడిగాను. వీలయితే, అవసరం అయితే సహాయం చెయ్యమని అర్థించాను.

అందరికీ భయమే. ఏదో మాట్లాడుతున్నారు తప్ప మనస్ఫూర్తిగా ఎవరూ మేమున్నాం అనడం లేదు. ఈ టైములో వారిని ఇబ్బంది పెట్టడం భావ్యమూ కాదు.

ఎలా, ఏం చెయ్యాలి.. అనే మీమాంసతో, తర్జనభర్జనలతో కాలం గడిపాను.

తీరా రేపే ప్రయాణం అని రిలాక్స్ అవుతుంటే ఆ ఉదయం ఏజంటు ఫోన్ చేసి విజయవాడ ఫ్లయిట్ కేన్సిల్ అయిందనే చావు కబురు చల్లగా చెప్పింది. నిలువెల్లా నిస్పృహ కమ్ముకుంది.

"మరెలా.. ఇక ఇండియాలోని ఏ సిటీకీ సర్వీసులు లేవా" దిగులుగా అడిగాను.

"10 వ తేదీన హైద్రాబాద్ కు సర్వీస్ మొదలయింది మేడం" చెప్పింది తాపీగా.

కాగల కార్యం గంధర్వులే తీర్చినట్లయింది.

"మరి నాకు కావల్సింది అదే కదా. వెంటనే హైద్రాబాద్ కు టికెట్ చెయ్యండి." చెప్పాను సంతోషంగా.

"సరే సీట్ వుందో లేదో చూసి తిరిగి కాల్ చేస్తాను" అంది.

కాల్ వచ్చేంతవరకూ ముళ్ళమీద నిల్చున్నాను నేను. సీట్ దొరికింది. విజయవాడ టికెట్ కంటే నాలుగువేలు తక్కువే.

మనీ తిరిగి ఇచ్చేసింది మా ఏజెంట్. ఇంకేం. మంచిదే కదా.

దేవుడు అన్నివిధాలా సానుకూలంగా వుండి సహాయం చేస్తున్నాడు అనిపించింది.

నేను దేవుడ్ని ఎక్కువగా తలచుకుని, కోరుకుని ఇబ్బంది పెట్టను కానీ ఈ సమయంలో దేవుడ్ని తలచుకోవడం సబబే అనిపించింది. దిక్కుతోచని స్థితిలో సహజమే మరి.

వారం ముందే శ్రీలంక "సిరియాని," నేపాలీ "మూనా" నా సామాన్లు, బట్టలు అన్నీ చక్కగా సర్దేసారు. వారికి కావల్సినవి వారు పంచుకున్నారు.

నా ఫ్రెండ్స్ లలిత, చంద్రకళ కూడా నాతో వుండి చాలా సహాయం చేసారు.

బట్టలన్నీ (చీరలు) నేపాల్, శ్రీలంక, భూటాన్, ఇండోనేషియా, ఇండియా అమ్మాయిలకు ఇచ్చేసాను.

కొన్ని చీరలు అట్ట పెట్టెల్లో సర్ది 80 కేజీల వరకు కార్గో లో హైద్రాబాద్ కు పంపేసాను. ముఖ్యమైన లగేజ్ మాత్రం నాతోపాటూ తీసుకెళ్ళడానికి ప్యాక్ చేసాము.

2020 జూలై 10వ తేదీ ఉదయం చంద్రకళ వాళ్ళ కార్లో ఎయిర్పోర్ట్ లో డ్రాప్ చేసారు. నా ఫ్రెండ్ లలిత కూడా వచ్చింది.

తమ్ముడు రమేష్ కర్ఫ్యూ వలన వెహికల్స్ లేక దాదాపూ 10 కిమీ దూరం నా కోసం నడిచి వచ్చాడు.

కువైట్ ను, వీళ్ళందరినీ మరలా తిరిగి చూడగలనా? కరోనా ఎవరిని కబళిస్తుందో. ఎవరిని మిగిలిస్తుందో. వీడ్కోలు చెపుతుంటే కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

ఇరవై రెండేళ్ళ అనుబంధం ఈ కువైట్ దేశంతో. సగం జీవితం ఇక్కడే గడిచింది. ఈ కరోనా వచ్చి పడకపోతే ఇంకెన్నేళ్ళు ఇక్కడే వుండేదాన్నో తెలియదు. నాకు గుండెదడ తగ్గలేదు. ఏదోగా వుంది. పేరులేని ఫోబియా అనుకుంటా.

అంతకుముందు దాదాపూ వంద సార్లు ఫ్లయిట్ ఎక్కి వుంటాను. పది దేశాలు చూసాను.

కానీ ఇప్పుడు..

క్లోజ్డ్ ప్రదేశాల్లోకి వెళ్ళాలంటే భయపడుతున్నాను. ఒక్కదాన్నే వెళ్ళడం ఎలా అనుకుంటూ ట్రోలీని తోసుకుంటూ బోర్డింగ్ పాస్ కోసం లగేజ్ కౌంటర్ దగ్గరికి వెళుతున్నాం.

ఇంతలో.. దేవుడే పంపించినట్లు ఎవరో వెనకనుండి "హలో మేడం" అంటూ పిలిచారు.

ఒకబ్బాయి, వాళ్ళ అమ్మ నా వెనుకే వరుసలో వున్నారు.

"మేడం.. మా అమ్మ ఒక్కరే వస్తున్నారు. మీరు ఆమెకు తోడుగా వుండగలరా" అని అతను అడిగాడు.

ఆ సమయంలో నేనే తోడు కోసం వెతుకుతున్నాను. వెతకబోయిన తీగె కాలికి తగిలినట్లు ఆమె వైపు తేరిపార చూసాను.

చాలా ప్లెజెంట్ గా మా అమ్మకు చెల్లిలా అనిపించింది.

"అలాగే. తప్పకుండా" అన్నాను.

ఆంటీ నన్ను పరిచయం చేసుకుంటుంటే అతనే నా టికెట్ పాస్పోర్ట్ తీసుకెళ్ళి కౌంటర్లో కొవిడ్ పేపర్లు అన్నీ ఫిల్ చేసి ఇద్దరికీ పక్కపక్క సీట్లు తీసుకొచ్చాడు.

నా లగేజ్ నాలుగు కేజీలు ఎక్కువ వుంటే ఆంటీ లగేజ్ తక్కువుంది కాబట్టి అడ్జస్ట్ చేసి ఒకే ఫామిలీ అని చెప్పి కలిసి వేసేసారు. హమ్మయ్య అనుకున్నాను.

మా ఫ్రెండ్స్ "ఆంటీ తోడు దొరికారు కదా ఇక నీకు భయం లేదు లలితా వర్రీ అవకు" అని చెపుతూ వెనక్కి మరలారు.

నాది మధ్యలో సీటు. ఆంటీది ఐసల్ సీటు.

మధ్యలో కూర్చునే వారికి ఎయిర్ హోస్టెస్ పిపి కిట్ ఇస్తున్నారు.

యుద్ధోపకరణాలు ధరించి నిండా ముసుగు వేసుకుని మధ్యలో కూర్చున్నాను. అయినా ఏదో భయం. నా రూపం నాకే వింతగా కనిపించింది.

ఇంతవరకూ ఓకె. హైద్రాబాద్ లో దిగాక పధ్నాలుగు రోజులు క్వారంటైన్ అంటున్నారు. తలచుకుంటేనే భయమేస్తోంది. ఎలాగైనా ఇది తప్పించుకుని ఇంటికెళ్ళిపోతే బావుండు అని కోరుకుంటున్నాను.

నా పరిస్థితి గమనించినట్లుగా పక్కన ఆంటీ "లలితా నువ్వు భయపడకు. గతవారం మా తమ్ముడు యశోదాలో చనిపోయాడు. అందుకే ఇప్పుడు నేను ఇండియాకు వస్తున్నాను. ఇది ఎమర్జెన్సీ కాబట్టి నన్ను క్వారంటైన్ లో వుంచరట. నువ్వు మా అక్క బిడ్డవని మనిద్దరం కలిసే వచ్చాము అని చెపుతాను. ఇద్దర్నీ కలిపి బయటికి వదిలేట్లు నేను చూస్తాను" అంది.

మరొక్కసారి దేవుడు నా వెంటనే వస్తున్నట్లు అనిపించింది నాకు. పరిచయం, పలకరింపు, ప్లానింగూ అన్నీ ఆంటీవే. ఆంటీ మాటలతో 5 గంటల జర్నీ చేసినట్లు కూడా అనిపించలేదు. ఇంతవరకూ ఓకె కానీ హైద్రాబాద్ ఎయిర్పోర్ట్ లో దిగాక అబద్ధం ఆడాలి. ఎలా..

కష్టమయినా తప్పదు. లేదంటే హోటల్లో బిక్కుబిక్కుమంటూ పధ్నాలుగు రోజులు దిగ్బంధన వాసమే గతి.

ఆంటీ పేరు కొల్లు పద్మావతి. ఆమెది ఖమ్మం. కోడలి డెలివరీకి కువైట్ వచ్చి మూడ్నెల్లు అనుకున్నది కరోనా వలన ఆర్నెల్లు కువైట్ లోనే వుండిపోయింది.

చిన్న తమ్ముడు పచ్చ కామెర్లతో చనిపోయాడట. చాలా విషాదంలో వుంది పాపం.

హైద్రాబాద్ లో ఫ్లయిట్ దిగాక బయటపడటం అనుకున్నంత సులభం కాలేదు. ఎన్నో చెకింగులు, ప్రశ్నల అనంతరం ఒక పక్కన వుండమన్నారు.

చిన్న పిల్లలను, వృద్ధులను, బాలింతలను, గర్భిణీలను మాత్రమే బయటికి పంపిస్తున్నారు. మిగిలిన వారందరూ క్వారంటైన్ కి వెళ్ళాల్సిందే అని రెండు వారాలకు సరిపడా డబ్బు కట్టించుకుని బస్ లో కేటాయించిన హోటల్ కి పంపిస్తున్నారు.

ఆ తతంగం చూసి భయమేసింది. అక్కడున్న ఆఫీసర్ మా మాటలను పట్టించుకోలేదు.

అక్కడ మేమిద్దరమే మిగిలాం. తమ్ముడు చనిపోయినట్లు సరైన ఆధారాలు చూపించాలట. డెత్ సర్టిఫికేట్, హాస్పిటల్ రిపోర్ట్స్ కావాలి లేదా ఇద్దరూ క్వారంటైన్ కు నడవండి అన్నాడు. నిరాశ చెందాను నేను.

"నువ్వు వర్రీ కాకు" అంది ఆంటీ. వెంటనే ఆంటీ వాళ్ళ బంధువులకు ఫోన్ చేసింది. నిమిషాల్లో డెత్ సర్టిఫికేట్ వాట్సప్ లో వచ్చేసింది.

ఎయిర్పోర్ట్ ఆఫీసర్ అన్ని పేపర్లను పరిశీలించాడు. నన్ను కొన్ని ప్రశ్నలు అడిగాడు. అబద్ధం చెప్పాలంటే నాలుక తడబడింది. కా..నీ తప్పలేదు.

ఇద్దరి పాస్పోర్టులు తీసుకుని ఒక పేపర్ పై సంతకం చేసి మాకిచ్చి పద్నాలుగు రోజుల తర్వాత బేగం పేట లోని పాస్పోర్ట్ కంట్రోల్ ఆఫీస్ లో తీసుకోమన్నారు. బతుకు జీవుడా అనుకుంటూ బయటపడ్డాము.

ఎయిర్పోర్ట్ ప్రాంగణంలో నేను తగిలించుకున్న పిపి కిట్ ను తీసి డస్ట్బిన్ లో పడేసాను. శానిటైజర్ చేతులకు రాసుకున్నాను. బయటికి వచ్చి గాలి పీల్చుకుంటుంటే నిజంగా నేను ఇండియా కు క్షేమంగా వచ్చానా.. కలా అనిపించింది.

అష్టకష్టాలు అంటే ఇవేనేమో. మా తమ్ముడు మురళి, మా చెల్లి ప్రతిభ నా కోసం కారేసుకుని వచ్చారు.

మన నేలపై కాలు మోపగానే, మన గాలి పీల్చగానే, మా వాళ్ళను చూడగానే మంత్రించినట్లు నా గుండె దడ తగ్గిపోయింది. చిత్రంగా మామూలు మనిషిని అయ్యాను.

ఆంటీ వాళ్ళ కారు రాగానే వీడ్కోలు పలికి ఖమ్మం వెళ్ళిపోయారు. ఏ జన్మ బంధమో ఏమో అనుకోకుండా ఎదురుపడి ప్రయాణంలో నా తోడయి పిన్ని పాత్రను పోషించి భయంతో అదిరే నా గుండెకు ప్రశాంతత చేకూర్చిన ఆమెను ఆపద్బాంధవి అనాలేమో.

కరోనా వలన కఠినమైన దారుల్లో నడిచినా కొన్ని మంచి పాఠాలు కూడా నేర్చుకున్నాను. నిజమైన ఆత్మీయులను కొందరిని సంపాదించుకున్నాను.

కొన్ని బంధాలు అనుబంధాలై జీవితాంతం నిలుస్తాయి.

ఇప్పుడు కూడా అప్పుడప్పుడూ పద్మావతి ఆంటీకి ఫోన్ చేసి పలకరిస్తుంటాను. ఆమెతో మాట్లాడితే స్వంత పిన్నితో మాట్లాడినట్లే వుంటుంది.

Post your comments